# హౌరా! పురుషులెంతటివారు...

## మాడుగుల కృష్ణకుమారి

అలసిపోయి ఆఫీసు నుంచి బయటపడిన సుజాత అలవాటుగా బస్‌స్టాప్ వైపు నడిచింది నీరసంగా. "అబ్బ! ఈ రోజు వర్కు మరీ ఎక్కువయింది. అసలీ స్టెనో ఉద్యోగం అంటేనే అంత!" అనుకుని బస్ కోసం వెయిట్ చెయ్యటం మొదలు పెట్టింది. వరుసగా నాలుగు బస్సులు వచ్చాయి కాని తనకు కావలసిన అయిదో నంబరు బస్సు మటుకు రాలేదు. సమయం ఆరు దాటుతోంది. బస్ స్టాపులో ఒక పాతికమంది దాకానే అయిదో నంబరు బస్సుకోసం వెయిట్ చేస్తున్నారు.

"ఎక్స్క్యూజ్ మీ! మీరు ఏమీ అనుకోకపోతే, మీ చేతిలోని 'వీక్లీ' ఒకసారిస్తారా?" అన్న మాటలకు చటుక్కున తలత్రిప్పి చూసింది సుజాత. ప్రక్కనే హిప్పీ క్రాపింగ్‌తో ఇకిలిస్తూ అడిగాడొక యువకుడు. మాట్లాడకుండా వీక్లీ అతనికిచ్చింది.

డర్టీ రోగ్! ఏదో ఒక వంకతో ఆడపిల్లని మాట్లాడించాలని కాకపోతే తన చేతిలోని క్లాస్‌బుక్ చదువుకోలేడూ! ఈ రోజుల్లో ఇదొక జాడ్య మయింది. ఏదో మిషతో ఆడపిల్లలను మాట్లాడించాలని, వాళ్ళతో స్నేహం పెంచుకోవాలని.

"చూడండి! ఈ వీక్లీలో 'బస్ స్టాప్‌లో లవ్' అన్న కథ చదివారా? అది వ్రాసింది నా ఫ్రెండే లెండి. చాలా బావుంది. మీరు చదివారా? చదవకపోతే చదవండి. ఐ వాంట్ టు నో యువర్ కామెంట్స్" నవ్వుతూ అడిగాడా యువకుడు.

ఒళ్ళు మండిపోయింది సుజాతకు. ఇడియట్, బ్రూట్. పుస్తకం తీసుకున్నది కాక కథల గురించి చెప్పి పైగా కామెంట్స్ కూడా.

"బస్ స్టాప్‌లో లవ్ కథ చదవలేదుకాని



'అమ్మాయి కొట్టిన చెప్పు దెబ్బ' అన్న కథ చదవండి. అది నా స్నేహితురాలు వ్రాసింది. చాలా బావుంటుంది." అని అందామని నోటిదాకా వచ్చినా తమాయించుకుంది. ఇంతలో బస్ కనిపించటంతో "దయచేసి పుస్తకం ఇస్తారా?" అని అతని చేతిలోంచి వీక్లీ లాక్కుని బస్‌వైపు పరుగు దీసింది సుజాత.

బస్ రావటమూ, ఒకరిద్దరిని మాత్రం ఎక్కించుకుని వెళ్ళిపోవటమూ జరిగింది. సుజాతకు చిరాకు మరీ ఎక్కువయింది. దానికి తోడు చుట్టూ చేరిన కుర్రకారు కాకిగోల అధికమయింది. ఒక కొంటె కోణంగి ఆమె వైపు అదోలా చూసి 'బస్ మిస్ అయినందుకు బాధపడకండి మిస్. గివ్ మీ ఏ స్వీట్ కిస్' అని పకపకా నవ్వాడు.

సుజాత పరిస్థితి వర్ణనాతీతంగా వుంది. మరొక పది నిముషాల్లో మరొక అయిదో నంబర్ బస్సు వచ్చింది. ఆగకుండానే ఎగబడుతున్నారు జనం. కండక్టర్ ఎక్కేవాళ్ళను ఆగమని, లోపలి వాళ్ళను దిగమని హెచ్చరిస్తున్నాడు. ఎవ్వరూ అతని మాటలు లక్ష్య పెట్టటంలేదు. పద్మవ్యూహంలోకి జొరబడినట్లు సుజాత ఎట్లాగో లోపలికి చేరింది. బస్సు మరీ రష్‌గా వుంది. ఎక్కడమయితే ఎక్కింది కాని ఊపిరి పీల్చుకునేందుకు కూడా వీలులేకుండా వుంది. జనం ఇంకా ఎక్కుతూనే వున్నారు. సీట్లన్నీ ముందుగానే నిండిపోయినాయి. ఎలాగో పై రాడ్



పట్టుకుని నిలబడింది సుజాత. నిండు గర్భిణిలా తయారైన బస్సు నెమ్మదిగా కదిలింది. నైలెక్స్ చీరేమో గాలికి ఎగిరిపోతోంది. పైట సర్దుకుందామనుకుంటే ఒక చేతిలో బ్యాగ్, మరొక చేత్తో రాడ్ పట్టుకుంది. వెనకా ముందూ మగవాళ్ళు. బస్ స్టాప్‌లో పుస్తకం అడిగినవాడు సరిగ్గా వెనకాలే అనుకున్నట్లు నిలబడ్డాడు. అసలు ఇలాంటి ఛాన్సుల కోసమే వీళ్ళు బస్సెక్కేది. లేకుంటే నడిచిపోలేరూ! అనుకుంది మనస్సులో. బస్సు ఆగింది. ముందు పైట గట్టిగా దోపుకుని కాస్త ఊపిరి పీల్చుకుంది. మళ్ళీ ఫుల్‌గా లోడ్ చేసుకుని పరుగు తీసింది బస్సు.

'ఆ ప్రక్క సీటులోని ఎర్రపాటి ఆవిడ ఏమిటో నేను బస్ ఎక్కినప్పటినుంచి నాకేసే మిర్రి మిర్రి చూస్తోంది. నేనేదో కావాలని ఈ మగవాళ్ళ మధ్య నిలబడ్డానని ఆవిడ తీక్షణ వీక్షణాలకు అర్థం కాబోలు. తల్లీ! అపార్థం చేసుకోకు' అనుకుంది సుజాత.

మళ్ళీ బస్సు ఆగింది. కాస్త ఖాళీ అయింది. ఒకసారి ఎక్కడైనా చోటు వుందేమోనని చూసింది సుజాత. ఎదురు సీట్లో ముసలాయన ప్రక్కన చోటుంది. నిలబడినందుకు కాళ్ళు పీక్కుపోతున్నాయి. ఫర్వాలేదు ఈయన ప్రక్క కూర్చోవచ్చు అనుకుని కూర్చోబోయింది.

"చూడమ్మాయ్! నువ్వా కిటికీ ప్రక్కన కూర్చో నాకు చల్లగాలి పనికిరాదు." అంటూ తను ఇవతలికి జరిగాడు. కాస్త గాలయినా తగులుతుందని ఆశతో కిటికీ ప్రక్కనే కూర్చుంది సుజాత. బస్ బయలుదేరింది. చల్లగాలి రావటంతో ప్రాణం హాయిగా వున్నట్లయింది సుజాతకు. మూడు వంతుల భారీకాయాన్ని సీటుకి సరిపడేలా వేశాడా ముసలాయన. పైగా ముక్కుపొడుం వాసనొకటి. ఇంకో పావుగంటలో దిగిపోయే తను ఎలాగో సరిపెట్టుకోక తప్పదని ఒదిగి ఒదిగి కూర్చుంది సుజాత. చల్లగాలికి కళ్ళు మూతలు పడ్డాయి. తన వొంటిమీద బరువు చేరుతున్నట్లనిపించేసరికి కళ్ళు తెరచింది సుజాత. "ఏమిటీ ముసలాయన – మరీ మీదపడిపోతున్నాడు. కావాలనా లేక బస్సు కుదుపులకా?" అర్థంకాలేదు సుజాతకు. ముసలాయన వెనకగా వేసిన చెయ్యి సరిగ్గా సుజాత భుజం



మీద వుంది. చూసేవాళ్ళకి సుజాత ముసలాయన ఒళ్ళో కూర్చున్నట్లుంది. ఖర్మకాలి ఈ రోజు అన్నీ ఈ అనుభవాలే! సుజాత విసుక్కుంది. ముసలాయన కావాలనే మీదకు ఒరిగిపోతున్నాడు. ముక్కుపొడుం సుగంధానికి సుజాతకు వాంతి వచ్చేలావుంది. రెండో చెయ్యి మాత్రం ఎందుకు ఖాళీగా వుండాలన్నట్టు సుజాత ఒళ్ళో వేసి మరీ

కూర్చున్నాడు దర్జాగా ముసలాయన. శరీరం కంపరమెత్తిపోయింది సుజాతకు. మొదట కాకతాళీయంగానేమో అనుకుంది కాని తర్వాత కావాలనే చేస్తున్నట్లనిపించింది సుజాతకు.

"డర్టీ ఓల్డు ఈగిల్! వయస్సులో ఉన్న పిల్లను చూసేసరికి నీకూ పుట్టింది దుర్బుద్ధి. తల నెరిసినా తలపులు చావలేదు. విసురుగా లేచి చటుక్కున నిలబడింది. అంత కోపంగా లేవటంతో సుజాత హైహీల్స్ క్రింద పడి పచ్చడయింది ముసలాడి కాలు. అప్పుడు కాని ఆయన తేరుకోలేదు. అసలు ముసలాడు చెయ్యి వేసినప్పుడే గడ్డి పెట్టవలసింది. చిన్న గొడవ అయితే బస్‌లో వారందరికీ వినోదం. అసలు ముసలాడయితే మాత్రం ఎవరు నమ్మమన్నాడు? పుర్రెతో పుట్టిన బుద్ధి పుడకలతోనే పోవాలి! ఆమె ఆలోచనలను కట్ చేస్తూ బస్ ఆగింది. దిగవలసిన చోటు రావటంతో దిగి ఊపిరి గట్టిగా పీల్చుకుంది సుజాత. ఆవాల్టి యజ్ఞం అలా ముగిసినందుకు ఆనందిస్తూ ముందుకు కదిలింది. నడుస్తున్న సుజాతకు వెనకాలనుంచి "ఎంత సోగ్గున్నావే కిలాడి గుంటా ఎంత సోగ్గున్నావే" అన్న పాట విన్పించటంతో వెనుదిరిగి చూసింది. సరిగ్గా పది, పన్నెండేళ్ళ వయసుంటుందేమో సైకిల్ మీద వస్తూ సుజాత వంక చూస్తూ పాడుతున్నాడొకడు. ఇంకెవరైనా ఉన్నారేమోనని చుట్టూ తిరిగి చూసింది. ఊహూ! తను తప్ప వేరెవరూ లేరు. ఎవ్వరి నుద్దేశించి పాడుతున్నాడో అర్థం అయింది సుజాతకు. తను వెనక్కి తిరగటం చూసి పాటే కాకుండా ఈల వేస్తూ కన్ను కొట్టాడు వాడు.

నిర్ఘాంతపోయింది సుజాత. వేలెడు లేడు వీడి వయసెంత? వీడి చేష్టలేమిటి? సుజాత మనసులో వరుసగా బస్ స్టాప్‌లో పుస్తకం అడిగిన యువకుడు, బస్సులో ముసలాడు, బస్సు దిగాక ఈ కుర్రాడు ముగ్గురూ ఒకరి తర్వాత మరొకరు గిర్రున మెదిలారు. "ఛీ! ఛీ! మేనర్స్‌లెస్ మాడ్స్! ఆడపిల్లలు కనబడితే చాలు వయసుతో పరిమితం లేకుండా వెకిలి చేష్టలు, వెర్రిమొర్రి వేషాలు, అర్థం లేని మాటలు! అసలు ఈ మగవాళ్ళంతా ఇంతేనేమో—అన్న భావం మనసులో మెదిలి వడివడిగా అడుగులు వేసింది సుజాత.

[అంకితం: ప్రతిరోజు బస్సుల్లో ప్రయాణం చేస్తూ, రోడ్ మీద రాగింగ్స్‌లో ఎదురయిన అనుభవాలను ఎదుర్కొనే అమ్మాయిలకు.]

## మరో పువ్వుల ముగ్గు

మొదట 18 చుక్కలు 6 వరుసలలో ఒకదానికొకటి సమాన దూరంలో వుండేటట్లు పెట్టుకోవాలి. తరువాత పైన, కింద ఒక్కొక్క చుక్క విడిచి పెడుతూ 6 చుక్కలు వచ్చేవరకు రెండు వైపులా పెట్టుకుని, ఈ ముగ్గులో వున్నట్లు కలుపుకుంటే అందమైన పువ్వుల ముగ్గు పూర్తవుతుంది.

—పి. వి. భారతి

